

ఆర్‌టిసి బస్సుల్లో టపాసుల రవాణా నిషేధం

కార్గో ఆర్‌ఎం ఇ.మాధవ్

పెనుమంట్ర : ఆర్‌టిసిలోని అన్ని రకాల బస్సుల్లో దీపావళి టపాసులు రవాణా చేయడం పూర్తిగా నిషేధమని ఎపిఎస్ ఆర్‌టిసి కార్గో పార్శిల్ విభాగం ఆర్‌ఎం ఇ మాధవ్ అన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా మండలం లోని మార్టేరు ఆర్‌టిసి కార్గో కార్యాలయం, పెనుగొండ బస్టాండ్‌లో ఉన్న కార్గో పాయింట్లను తనిఖీ చేశారు. రానున్న దీపావళి సందర్భంగా దీపావళి టపాసులు ఆర్‌టిసి కార్గో ద్వారా బుక్ చేసుకునే అవకాశం ఉందని, అయితే ప్రస్తుతం మందుగుండు సామాగ్రి నిషేధిత జాబితాలో ఉండటం వల్ల ప్రమాదకరం కనుక బుక్ చేయవద్దు అని సదరు పాయింట్ల సిబ్బందికి తెలిపారు. అనుమానిత పార్శిల్ బుక్ చేయమని అడిగితే వినియోగదారునికి అంగీకారమయితేనే పార్శిల్ ఓపెన్ చేసి చూడాలన్నారు. అలా వినియోగదారునికి అంగీకారమయితేనే పార్శిల్ బుక్ చేయాలన్నారు. సరకు రవాణా, ప్రయాణ అవసరాలకు ఆర్‌టిసి సేవలు వినియోగించుకోవాలని కోరారు.

ఎరువులకు.. ఓటిపినా..?

రబీలో కొత్త ప్రయోగానికి ప్రభుత్వం కసరత్తు

వెబ్‌ల్యాండ్ ఆధారంగా ఎరువుల పంపిణీకి ఆలోచన

వెబ్‌ల్యాండ్‌లో ఫోన్ నెంబర్లన్నీ భూ యజమానులవే

ఓటిపి భూ యజమానికి వెళ్తే కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరమే

రెండు జిల్లాల్లో రబీలో 3.25 లక్షల ఎకరాల్లో వరిసాగు

ఏలూరు, పశ్చిమలో మొత్తం లక్షా 90 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రబీలో వెబ్‌ల్యాండ్ ఆధారంగా ఎరువుల పంపిణీ చేపట్టి ఓటిపి (వన్‌టైం పాస్‌వర్డ్) తప్పనిసరి చేస్తే కౌలు రైతుల కష్టాలు వర్ణనాతీతంగా మారే ప్రమాదం కనిపిస్తోంది. వెబ్‌ల్యాండ్‌లో భూ యజమానుల ఫోన్ నెంబర్లే ఉన్నాయని, ఓటిపి భూ యజమానులకు వెళితే సహకరించే పరిస్థితి ఉండదని కౌలు రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కౌలురైతులకు ఇబ్బంది లేకుండా ఎరువుల పంపిణీ జరిగేవిధంగా ఆలోచన చేయాలని అంతా కోరుతున్నారు. ఖరీఫ్‌లో యూరియా సమస్య ప్రభుత్వాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. యూరియా అవసరం లేకపోయినా రైతులు పట్టుకెళ్లడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయన్నట్లు చర్చ సాగింది. దీంతో రబీలో అటువంటి పరిస్థితి రాకుండా వెబ్‌ల్యాండ్ (ఇ-పంట) ఆధారంగా ఎరువుల పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎరువుల కావాల్సిన రైతులు సాగుచేసే భూములకు సంబంధించిన వివరాలను దుకాణాల వద్దకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఆ వివరాలను వెబ్‌ల్యాండ్‌లో పరిశీలించి మూడు విడతలుగా ఎంత అవసరమో అంతవరకూ ఎరువులు ఇస్తారని చెబుతున్నారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయగానే వెబ్ ల్యాండ్‌లో ఎవరు పేరున భూమి ఉంటుందో వారి ఫోన్ నెంబర్‌కు ఓటిపి వెళ్తోంది. ఆ ఓటిపి నెంబర్ చెబితేనే ఎరువులు ఇవ్వడం జరుగుతోంది. ఈ విధానం అమల్లోకి వస్తే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో తీవ్ర ఇబ్బందిగా మారే పరిస్థితి ఏర్పడనుంది. రబీలో ఏలూరు జిల్లాలో 95 వేల ఎకరాల్లో వరిసాగు జరగనుండగా, పశ్చిమలో 2.25 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టనున్నారు. రెండు జిల్లాల్లో 80 శాతం సాగు కౌలు రైతులే చేస్తున్నట్లు అధికారిక లెక్కలు సైతం చెబుతున్నాయి. రబీలో యూరియా 54 వేల మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఇతర ఎరువులు కలిపి మొత్తంగా లక్షా ఐదు వేల మెట్రిక్ టన్నుల అవసరం పడుతుందని వ్యవసాయాధికారులు ప్రణాళికలు రూపొందించారు. పశ్చిమలో యూరియా 36 వేల మెట్రిక్ టన్నులు అవసరం అవుతుందని, కాంప్లెక్స్, ఇతర ఎరువులు కలిపి మొత్తంగా 86 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కానున్నట్లు ప్రణాళికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. ఇప్పటివరకు కౌలురైతులకు కౌలురైతులు నేరుగా వెళ్లి ఆధార్‌కార్డు చూపించి ఎరువులు తీసుకుంటున్నారు. రబీ నుంచి ఆ పరిస్థితి మారనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఓటిపి లింకు పెడితే తీవ్ర ఇబ్బందులు

వెబ్‌ల్యాండ్‌లో భూ యజమానుల పేర్లు తప్ప కౌలు రైతుల పేర్లు నమోదు కాలేదు. ఒకవేళ ఎక్కడైనా చేసినా అది నామ మాత్రమే. రబీలో ఎరువుల కోసం కౌలురైతు వెళితే వెబ్‌ల్యాండ్‌లో భూ యజమాని ఫోన్ నెంబర్ ఉంటుంది. దీంతో ఓటిపి భూ యజమాని నెంబర్‌కు వెళ్తోంది. చాలా మంది భూ యజమానులు ఇతర పట్టణాలకు వెళ్లి వ్యాపారాలు చేసుకుంటున్నారు. కొంతమంది ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల్లోనూ ఉన్నారు. భూ యజమానికి ఓటిపి వెళితే తిరిగి ఫోన్ చేసి ఆ నెంబర్ చెప్పే పరిస్థితి ఏమాత్రమూ ఉండదు. కొంతమంది ఫోన్లు ఎత్తే అవకాశం సైతం ఉండదు. అటువంటప్పుడు కౌలురైతులకు ఎరువులు ఏవిధంగా అందిస్తారన్న ప్రశ్న అందిరినీ వేధిస్తోంది. వెబ్‌ల్యాండ్‌లో కౌలురైతుల ఫోన్‌నెంబర్లు నమోదు జరిగితేనే ఓటిపి వ్యవహారం ముందుకు సాగుతోంది. లేకపోతే ఎరువుల కోసం క్యూలైన్లు పెరిగిపోతాయి. ఇది ప్రభుత్వానికి మరింత చెడ్డపేరు తెచ్చే అవకాశం ఉంటుంది. 'పొయ్యిలోంచి పెనంపైన పడిన' చందగా ప్రభుత్వం పరిస్థితి మారుతోంది. ఎరువుల పంపిణీకి ఓటిపి లింకు పెట్టడం తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కౌలు రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువుల పంపిణీ జరగాలన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. లేకపోతే కౌలురైతులు రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడనుందనడంలో ఎటువంటి సందేహమూ అక్కర్లేదు. శుక్రవారం అన్ని జిల్లాల వ్యవసాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ జరగనుంది. ఈ సమావేశంలో ఎరువుల పంపిణీపై ప్రభుత్వం ఏ విధానాన్ని ప్రకటిస్తుందోనన్న ఉత్కంఠ కొనసాగుతోంది.

జిఎస్‌టి తగ్గింపుతో ప్రజలకు మేలు

కలెక్టర్ చదలవాడ నాగరాణి


జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిఎస్‌టి తగ్గింపుతో ఆటో మొబైల్ రంగంలో ప్రజలకు ఎంతో మేలు చేకూరిందని, ఈ ప్రయోజనాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. రవాణా శాఖ, వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం భీమవరం లూథరన్ హైస్కూల్ గ్రౌండ్ నుంచి వాహన ర్యాలీని కలెక్టర్ నాగరాణి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ప్రకాశం చౌక్, జెపి రోడ్‌ల మీదుగా కాస్మోపాలిటన్ క్లబ్ భీమవరం జిఎస్‌టి బెనిఫిట్ బజార్ వరకూ కొనసాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్, జిఎస్‌టి నోడల్ అధికారి టి.రాహుల్ కుమార్ రెడ్డి కూడా పాల్గొన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ వాహన ర్యాలీ ద్వారా జిఎస్‌టి తగ్గింపుతో సామాన్య ప్రజలకు కలిగే ప్రయోజనాలను అందరికీ అర్థమయ్యేలా అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ఆటో మొబైల్ రంగంలో జిఎస్‌టి తగ్గింపు ధరలపై ప్రజలకు అవగాహన కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశమని అన్నారు. దీనివల్ల సామాన్య వినియోగదారులు సైతం బైకులు కొనుగోలు చేయడానికి చక్కటి అవకాశం లభించిందని పేర్కొన్నారు. వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ కెపి.శైలజ, జిల్లా రవాణా అధికారి కెఎస్‌ఎంవి.కృష్ణారావు, జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి కొప్పర్తి అప్పారావు, జిఎస్‌టిఒ డి.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ కెఎస్ఆర్.ప్రసాద్, తహశీల్దార్ రావి రాంబాబు, ఎంపిడిఒ ఎన్.మురళి గంగాధరరావు, రవాణా శాఖ సిబ్బంది, ఆటో మొబైల్ రంగ మేనేజరు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కలెక్టరేట్ వద్ద పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న పంచాయతీ కార్మికులు

ప్రజాశక్తి - భీమవరం

పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనాలు అమలు చేయాలని పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం కలెక్టరేట్ వద్ద యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శివరాం రాజారెడ్డి మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యలు వినే నాథుడే కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వేధింపులు పెరిగాయని, వేతన బకాయిలు, పని ఒత్తిడి బాగా పెరిగిందని అన్నారు. టెండర్‌తో నిమిత్తం లేకుండా ఉద్యోగాలు కొనసాగించాలని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ టెండర్ల పేరుతో డబ్బులు వసూలు చేయడం మానుకోలేదన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ స్వచ్ఛభారత్, క్లీన్ అండ్ గ్రీన్ వంటి ముద్దు ముద్దు పేర్లు పెట్టి నేతలు చీపుర్లు చేతబట్టి ఫొటోలకు ఫోజులివ్వడంలో ఇబ్బంది లేదని పరిశుభ్రతను కాపాడే వాళ్ల పరిస్థితులను పట్టించుకోకపోవడం బాధాకరమని తెలిపారు. కార్మికులకు కనీస వేతనాలు లేక, నెలనెలా వేతనాలు అందక, కనీసం పంచాయతీల ద్వారా ఇవ్వాల్సిన యూనిఫామ్‌లు, సబ్బులు, ఆయిల్స్, చెప్పులు, గుర్తింపు కార్డులు కూడా అందివ్వకుండా కేవలం స్వచ్ఛభారత్ అంటూ నినాదాలు చెప్పుకుంటే ఉపయోగం ఏముంటుందన్నారు. ప్రభుత్వం కొత్తగా చెబుతున్న స్వర్ణ పంచాయతీల్లో సీనియార్టీని బట్టి పంచాయతీ కార్మికులకు ఉద్యోగోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా స్థాయిలోనైనా పంచాయతీ కార్మికుల సమస్యలు వినడానికి జాయింట్ మీటింగ్ వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిపిఒ కార్యాలయ ఎఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కిరణ్, రాజబాబు, మల్లుల ఏసుబాబు, శివ, శ్రీను పాల్గొన్నారు.

ఎక్సైజ్ సురక్ష యాప్‌ను వినియోగించుకోవాలి

నకిలీ మద్యమని ప్రచారం చేస్తే చర్యలు - జిల్లా ఇన్‌ఛార్జి ఎక్సైజ్ అధికారి కెవిఎన్.ప్రభుకుమార్




ప్రజాశక్తి - భీమవరం

వినియోగదారులు మద్యం బాటిళ్లపై బార్ కోడ్ స్కాన్ చేసిన తర్వాతే మద్యం బాటిళ్లను కొనుగోలు చేయాలని ఏలూరు జిల్లా ఎక్సైజ్ సహాయ కమిషనర్, జిల్లా ఇన్‌ఛార్జి ఎక్సైజ్ అధికారి కెవిఎన్.ప్రభు కుమార్ తెలిపారు. మద్యం షాపుల్లో విక్రయిస్తున్న మద్యం కల్తీదా, నాణ్యమైందా అని తెలుసుకోవడానికి వీలుగా ప్రభుత్వం 'ఎక్సైజ్ సురక్ష యాప్'ను రూపొందించి వినియోగంలోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ యాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగదారులైతే గూగుల్ ప్లేస్టోర్ నుంచి, ఆపిల్ ఫోన్ వినియోగదారులైతే https://play.google.com/store/apps/details?idR com.vishist.aptats లింక్‌ను తమ ఫోన్లలో డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ యాప్ ద్వారా మద్యం అసలా, నకిలీనా తనిఖీ చేసుకోవచ్చన్నారు. మద్యం షాపుల్లో కొనుగోలు చేసిన బాటిల్ మూతపై అతికించిన స్టిక్కర్‌కు ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే బ్రాండ్ పేరు, సైజ్, బ్యాచ్ నెంబర్, ఎంఆర్‌పి ధర తదితర సమాచారం తెలుసుకోవచ్చన్నారు. ఈ సమాచారాన్ని బాటిల్‌పై ఉన్న సమాచారంతో సరిపోల్చుకొని సరిపోతే అది ప్రభుత్వం సరఫరా చేసిన నాణ్యమైన మద్యమని, ఒకవేళ ఎటువంటి సమాచారం రాకపోతే అది ప్రభుత్వం సరఫరా చేయని మద్యం అని గుర్తించవచ్చని తెలిపారు. ఇకపై ఎవరైనా సోషల్ మీడియా ద్వారా మద్యం దుకాణాల్లో నకిలీ మద్యం ఉందనే వదంతులు సృష్టించి తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కల్తీ మద్యంపై సిబిఐ విచారణ జరపాలి

ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా


ర్యాలీలో మాట్లాడుతున్న ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

కల్తీ మద్యంపై ప్రభుత్వం సిబిఐ ఎంక్వయిరీ వేయించాలని వైసిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద రాజు డిమాండ్ చేశారు. కల్తీ మద్యాన్ని నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యంలో గురువారం ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ స్టేషన్ వరకూ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎక్సైజ్ సిఐ రాంబాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడకు వెళ్లినా నకిలీ మద్యం కనిపిస్తోందన్నారు. నీళ్ల అందుబాటులో లేవు ఏమో గానీ బెల్ట్ షాపులు, మద్యం షాపులు అందుబాటులోకి తీసుకొచ్చారని విమర్శించారు. టిడిపి నాయకులు వీధి వీధికీ బెల్ట్ షాపులు పెట్టి మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని విమర్శించారు. అక్రమ మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన నిందితుడు గత ఎన్నికల్లో టిడిపి తరపున కంబాలపల్లి నియోజకవర్గంలో పోటీ చేసి ఓడిపోయారన్నారు. ప్రభుత్వ అండదండలతో అక్కడ మద్యం ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి అక్రమ మద్యాన్ని రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా చేశారంటూ విమర్శించారు. గుట్టు రట్టు కావడంతో కేసును పక్కదారి పట్టించేందుకు వైసిపి టార్గెట్ చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపి, కూటమి నాయకులు సిండికేట్‌గా ఏర్పడి మద్యం దందా నడుస్తోందన్నారు. నకిలీ మద్యం తయారు చేస్తున్న వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నరసాపురంలో నకిలీ మద్యం, ఎంఆర్‌పి ధరల కంటే ఎక్కువగా అమ్ముతున్నారని, వాటిపై చర్యలు తీసుకోవాలని సిఐ రాంబాబును ప్రసాదరాజు కోరారు. లేకుంటే బ్రాందీ షాపు వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకట రమణ, ఎంపిపి సోని, ఉంగరాల రమేష్, వీసి కామన నాగిని, బుజ్జి, పీడీ.రాజు పాల్గొన్నారు.

డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సిఐటియు ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా


తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న డ్రైవర్లు

ప్రజాశక్తి - తణుకు

డ్రైవర్లను ఆదుకోవడం కోసం కూటమి ప్రభుత్వం వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం తహశీల్దార్ అశోక్‌వర్మకు వినతిపత్రం అందజేశారు. డ్రైవర్లు అందరికీ సంవత్సరానికి రూ.30 వేలు ఇవ్వాలని, సంక్షేమ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన స్త్రీ శక్తి పథకం వల్ల కూటమి ప్రభుత్వం ఆర్థికంగా, సంక్షేమంగా ఆదుకోవాలన్నారు. ఆటో, మ్యాజిక్స్, బస్సు, కార్ డ్రైవర్లు కిరాయిలు లేక తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన జిఒ 21ను వెంటనే రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలో లక్షల మంది రోజు వారి ఉపాధి కోసం డ్రైవర్లుగా ఉంటే కేవలం 3 లక్షల్లోపు రూ.15 వేలు ఇవ్వడం అన్యాయమన్నారు. లైసెన్స్ ఉన్న వారందరికీ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు అందే శ్రీనివాస్, అమీరుద్దీన్, గార రంగారావు, అంబటి రామకృష్ణ, కె.మారియ్య, సిహెచ్.మోహన్, ఎం.ప్రసాద్, చౌదరి, కనక మోహన్ రావు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

హౌసింగ్ కార్పొరేషన్ ఎమ్‌డి అరుణ్‌బాబు


తాళ్లకోడు ప్రభుత్వ లేఅవుట్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్ ఎమ్‌డి అరుణబాబు

ప్రజాశక్తి - ఆకివీడు

జిల్లాలో పేదల గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. గురువారం మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడు గ్రామం లే అవుట్‌ను ఆయన, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వం పేదల కోసం చేపట్టిన గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తిచేసి లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించేందుకు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పట్టణ, గ్రామీణ పథకాల కింద పేదల కోసం 56,210 గృహాలు మంజూరు చేయగా ఇప్పటి వరకు 35,970 గృహాలను పూర్తి చేయడం జరిగిందని, ఇంకా 20,240 గృహాలు వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయన్నారు. తాళ్లకోడులో ఇళ్ల నిర్మాణాలు పూర్తయినవి, ఇంకా పూర్తి చేయవలసినవి ఎన్ని ఉన్నాయో పరిశీలించారు. జిల్లాలోని అన్ని లేఅవుట్‌లలో మౌలిక సదుపాయాలను నూటికి నూరు శాతం వేగవంతంగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జెసి మాట్లాడుతూ పేదల గృహ నిర్మాణ పనుల ప్రగతిపై రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. వీటి నిర్మాణ పనులు వేగవంతం చేసి త్వరలో లబ్ధిదారులకు అప్పగించే దిశగా నూరు శాతం లక్ష్యాలను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, డిఇ పి.శివరామరాజు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఫరూక్, గృహనిర్మాణ శాఖ ఎఇ ఎం.అభితేజ్, ఎంపిడిఒ బాబురావు పాల్గొన్నారు.

ఎస్‌టి కాలనీలో సమస్యలు పరిశీలించాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా


కమిషనర్ రామచంద్ర రెడ్డికి వినతి ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

29వ వార్డు ప్రకాష్‌నగర్ ఎస్‌టి కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన మున్సిపల్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించి అనంతరం కమిషనర్‌కి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం టౌన్ నాయకులు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ ప్రకాష్ నగర్ ఎస్‌టి కాలనీలో 40 ఇల్లు మైదానపు గిరిజనులు నివాసం ఉంటున్నారని, వంద కుటుంబాలు ఉన్నాయన్నారు. సిపిఎం అనేక పోరాటాలు చేసిన ఫలితంగా రెండు పబ్లిక్ ట్యాప్‌లు వేశారు కానీ నీళ్లు మాత్రం రావటం లేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. సిపిఎంగా ఇంటింటికి కులాయిలు ఇవ్వాలని కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా చేసి కలెక్టర్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని, ఆమె వెంటనే స్పందించి ఇంటి పన్నుతో నిమిత్తం లేకుండా కాపురం ఉన్న ప్రతి ఒక్కరికి ఇంటి కుళాయిలు వేయాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. కానీ ఆరు నెలలు గడిచినా ఇంతవరకు ఇంటి కుళాయిలు వేయలేదని, దానివల్ల నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. గురువారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, కమిషనర్‌కి వినతిపత్రం అందజేశామన్నారు. ఆయన వెంటనే స్పందించి అధికారులను పిలిచి ఆస్తి పన్ను నిమిత్తం లేకుండా ఇంటింటికి కులాయి వేయాలని, అలాగే డ్రెయినేజీ సమస్య పరిష్కారం చేయాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. ప్రకాష్ నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని, వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మాణం చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలను సమీకరించి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం టౌన్ నాయకులు చల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, సంజీవరావు, దుర్గారావు, మరియమ్మ, యోహాను పాల్గొన్నారు.

కాసులిస్తే ఎక్కడైనా ఓకే..!

బాణసంచా దుకాణాల ఏర్పాటులో అధికారుల తీరుపై విమర్శలు


బాణసంచా దుకాణాల ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - వీరవాసరం

కాసులిస్తే నిబంధనలు పక్కన పెట్టి వ్యాపారస్తులు కోరిన చోటే బాణసంచా తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చునన్న రీతిలో అధికారుల తీరు ఉంది. స్థానికుల అభ్యంతరాలు మాకెందుకు.. మా జేబులో చిల్లర పడితే చాలు అన్నరీతిలో అధికారులు బాణసంచా దుకాణాలకు అనుమతులు ఇచ్చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గురువారం బాణసంచా దుకాణాలు ఏర్పాటు స్థలాలు అధికారులు పరిశీలించారు. మాకేమి ఉచితంగా అనుమతులు ఇవ్వడం లేదని, షాపుకు ఇంత చొప్పున అధికారులకు మామూళ్లు ఇస్తేనే తమకు అనుమతులు ఇస్తున్నారంటూ వ్యాపారస్తులు బాహటంగానే అంటున్నారు. దీపావళి పండుగ సందర్భంగా గతకొన్ని సంవత్సరాలుగా బాణసంచా దుకాణాల ఏర్పాటులో అధికారుల వైఖరి పట్ల విమర్శలు ఉన్నాయి. వీరవాసరం, నవుడూరు, కొణితివాడ, రాయకుదురు, మత్స్యపురి గ్రామాలలో సుమారు ఇరవై వరకు బాణసంచా దుకాణాలు ప్రతీ ఏటా ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే ఈ దుకాణాలన్ని జన సంచారం ఎక్కువగా ఉండే రహదారి వెంబడి ఏర్పాటు జరుగుతుంది. వీరవాసరంలో కళ్యాణ మండపాలు, గృహాల సమీపంలో జాతీయ రహదారి పక్కనే దుకాణాలు అనుమతులు ఇచ్చేస్తున్నారు. ఇదేవిధంగా మిగిలిన గ్రామాలలో జనాలు నిత్యం రాకపోకలు సాగించే రద్దీ మార్గాల వెంబడి దుకాణాల ఏర్పాట్లు జరుగుతున్నాయి. దుకాణాల ఏర్పాటులో తీసుకోవసిన కొన్ని జాగ్రత్తలు తీసుకుంటునప్పటికీ ముఖ్యంగా అగ్నిప్రమాదం సంభవిస్తే దుకాణాలు పైకప్పులు ఏర్పాటులో అధికారులు నిబంధనలకు పాతరేస్తున్నారు. అతి కొద్ది సమయంలోనే మంటలు వ్యాప్తి చెందే విధంగా దుకాణాలపై కప్పులు ఏర్పాటు చేసుకుంటున్నారు. షామియాణ టెంట్లు, మంటలు సులువుగా అంటుకునే పాలిథిన్ టెంట్‌లతో దుకాణాల పైకప్పుల ఏర్పాటు ప్రమాదాలకు సంకేతాలుగా ఉంటున్నాయి. గతంలో కొంతమంది అధికారులు బాణసంచా దుకాణాల ఏర్పాట్లలో నిబంధనలు ఖచ్చితంగా అమలు చేసిన దాఖలాలు ఉన్నాయి. గ్రామ శివారున మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేసుకుంటేనే అనుమతులు ఇచ్చేవారు. మండలంలో బాణసంచా దుకాణాలు ఏర్పాటుకు ఆయా గ్రామాలలో అనువైన మైదాన ప్రాంతాలు ఉన్నప్పటికీ ఆ ప్రాంతాలకు దుకాణాలు ఎందుకు తరలించడంలేదన్నది స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అదే జరిగితే అధికారులకు మామూళ్లు ఎలా ముడతాయంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్ శాఖల సంయుక్త పరిశీలనతో అభ్యంతరాలు లేని విధంగా ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా బాణసంచా దుకాణాలకు అనుమతులు ఇవ్వవలసి ఉంది. అధికారులు అభ్యంతరాలు పెడితే ప్రమాదాలు జరిగితే మాకేంటి.. ఒక్కో శాఖకు దుకాణానికి రూ.రెండు వేలు చొప్పున వసూలు చేసి సంబంధిత అధికారులకు ముట్టచెప్పి, తమ పరపతిని ఉపయోగించి తాము కోరిన చోటే దుకాణాలు ఏర్పాటు చేసుకునే విధంగా వ్యాపారస్తులు ముందుకు వెళుతున్నట్టు సమాచారం.

'కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి'

గణపవరం : కౌలురైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతూ గురువారం కౌలురైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యాన స్థానిక డిప్యూటీ తహశీల్దార్ శేఖర్ బాబుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి పెచ్చేట్టి నరశింహమూర్తి మాట్లాడుతూ రిజ్వర్ బ్యాంకు నిబంధనల ప్రకారం ప్రతి కౌలురైతుకు రెండు లక్షల రుణం అందజేయాలని అన్నారు. పంట నమోదు, కౌలురైతుల పేరు ఆధారంగా పెట్టుబడి సాయం అందజేయాలన్నారు. జిల్లాలో 80 శాతం కౌలురైతులే వ్యవసాయం చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం చట్టప్రకారం ఒప్పందం పత్రాలపై యాజమాని సంతకం పెట్టకపోవటం వల్ల కౌలురైతులకు గుర్తింపు కార్డులు అందటం లేదని అన్నారు. పంటలు పండిస్తున్న కౌలురైతులకు ప్రభుత్వ రాయితీలు అందటం లేదన్నారు. కూటమి ప్రభుత్వం కౌలురైతులకు ఇచ్చిన హామీ అమలు చేయటం లేదని విమర్శించారు. కార్యక్రమంలో గుత్తుల శ్రీనివాస్, పోసిన ఏసుబాబు, శిరికి రాంబాబు, విప్పర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆక్వా చెరువులకు సిఐఎఐ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఉప్పునీటి సాంద్రత కలిగిన ప్రాంతంలో ఆక్వా సాగు చేస్తున్న రైతులు అందరూ తప్పనిసరిగా సిఐఎఐ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం కలెక్టరేట్లో కలెక్టర్ నాగరాణి బ్రాకిష్ వాటర్ ఆక్వా సాగు రైతులతో, మత్స్యశాఖ అధికారులతో సమావేశమై సిఐఎఐ రిజిస్ట్రేషన్‌పై సమీక్షించారు. దేశంలోనే జిల్లాను ఎంపిక చేసి బ్రాకిష్ వాటర్ క్లస్టర్ కింద కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం జరిగిందన్నారు. దీనివల్ల కేంద్ర ప్రభుత్వం సిఐఎఐ కింద మంజూరు చేసే ప్రయోజనాలను పొందడానికి వీలవుతుందని తెలిపారు. జిల్లాలో 17,100 ఎకరాలు బ్రాకిష్ వాటర్ ఆక్వా సాగులో ఉందని, బ్రాకిష్ వాటర్ ఆక్వా రైతులందరూ తప్పనిసరిగా సిఐఎఐ రిజిస్ట్రేషన్లను ఈ నెలాఖరులోపు పూర్తి చేసుకోవాలని తెలిపారు. రైతుల సౌలభ్యం కొరకు రిజిస్ట్రేషన్లను త్వరితగతిన పూర్తి చేయడానికి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ద్వారా యువతను ఎంపిక చేసి ఒకరోజు శిక్షణను ఇచ్చి సిఐఎఐ రిజిస్ట్రేషన్లను పూర్తి చేయడానికి ఆలోచన చేసినట్లు తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ అయ్యా నాగరాజా, ఎడిలు ప్రసాద్, ఎల్ఎల్ఎన్.రాజు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకమాన్, యంగ్ ప్రొఫెషనల్ కృష్ణా రెడ్డి, బ్రాకిష్ వాటర్ సాగు ఆక్వా రైతులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి వైద్యులకు మద్దతుగా నిరసన

ప్రజాశక్తి - కాళ్ల

తమ న్యాయమైన డిమాండ్లను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ పిహెచ్‌సి వైద్యులు చేపట్టిన సమ్మెకు వైద్య సిబ్బంది మద్దతు తెలుపుతూ నిరసన వ్యక్తంచేశారు. బుధవారం కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. జిఒ నెంబర్ 99ని వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ వైద్యులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం నల్ల బ్యాడ్జీలతోనే విధులు నిర్వహించారు.

పాఠశాలకు ఫ్యాన్లు బహూకరణ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని రూరల్ పరిధిలోగల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గాంధీనగర్ పాఠశాలకు ప్రముఖ పారిశ్రామికవేత్త, టిడిపి నాయకులు కామిశెట్టి అయ్యప్ప నాయుడు రెండు ఫ్యాన్లను బహూకరించారు. వారికి పాఠశాల ఎస్ఎంసి ఛైర్మన్ కె.దుర్గారాణి, సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రోత్సాహకులు, ఉత్తమ ఉపాధ్యాయులు రాయపూడి భవానీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు దాతల సహకారం ఎంతో అవసరమని, తద్వారా పాఠశాలకు మౌలిక వసతులు కల్పించుకొని ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యనభ్యసించడానికి మౌలిక వసతులు ఎంతో సహకరిస్తాయని ఈ సందర్భంగా తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిల్లా సురేష్ బాబు, టి.మధుసూదన్ రెడ్డి, పేరెంట్స్ పాల్గొన్నారు.

బాణసంచా దుకాణం ప్రారంభం

ప్రజాశక్తి - కాళ్ల

దీపావళి సందర్భంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణంలో తక్కువ ధరకు అందుబాటులో ఉంటాయని ఏపి డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, రాజ్యసభ సభ్యులు పాక సత్యనారాయణ అన్నారు. పెదఅమిరం గ్రామంలో డిసిఎంఎస్ ద్వారా ఏర్పాటుచేసిన బాణసంచా దుకాణాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ, డిసిఒ సంకు మురళీకృష్ణ, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, కోరా రామూర్తి, చాగంటి పార్థసారథి, మంతెన చిననరసింహరాజు, దాట్ల శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

ప్రజాశక్తి - ఆచంట

బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, అనర్థాలను నివారించి హక్కులను తెలియజేసేందుకు ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ప్రకటించిందని ఎంపిడిఒ బిఎస్ఎస్.కృష్ణమోహన్ అన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని పెనుమంట్ర ఐసిడిఎస్ ఆధ్వర్యాన సిడిపిఒ ఎ.కృష్ణకుమారి అధ్యక్షతన గురువారం స్థానిక రామేశ్వరస్వామి సత్రంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాలికలు ఎదుర్కొంటున్న లింగ, అసమానతలు, విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, హింస బలవంతపు బాల్య వివాహాలు, వివక్షతపై అవగాహన పెంచడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అనంతరం బాలికలకు పోటీలు నిర్వహించి బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, వైస్ ఎంపిపి తాళం శ్రీనివాసరావు, ఎంపిటిసి దాసిరెడ్డి పుణ్యావతి పాల్గొన్నారు.

ఎక్సైజ్ సురక్షా యాప్ ద్వారా మద్యం నాణ్యత

ఎక్సైజ్ సిఐ ఇ.స్వరాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మద్యం నాణ్యతను కొనుగోలుదారులు ఎక్సైజ్ సురక్షా యాప్ ద్వారా తెలుసుకోవచ్చని తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సిఐ ఇ.స్వరాజ్యలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ కార్యాలయంలో మద్యం షాప్ లైసెన్స్‌దారులకు, సిబ్బందికి సురక్ష యాప్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ యాప్‌లో రెండు మాడ్యూల్స్ ఉంటాయని, చదువుకోలేని వారికి చాలా తేలిగ్గా ఈ యాప్‌ను వినియోగించవచ్చని తెలిపారు. యాప్ గురించి సందేహాలుంటే తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 9440902433 నెంబర్‌కు సంప్రదించగలరని తెలియజేశారు.

పర్యాటకులకు అసౌకర్యం కలగకూడదు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - మొగల్తూరు

కార్తీకమాసంలో పేరుపాలెం సౌత్, కేపీ పాలెం సౌత్ తీరంలో వచ్చే పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఎన్.రామనాథరెడ్డి సిబ్బందికి సూచించారు. గురువారం సాయంత్రం పేరుపాలెం బీచ్ గెస్ట్ హౌస్ వద్ద పలు శాఖల అధికారులతో ఆర్‌డిఒ దాసిరాజు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్తీక మాసం నెలరోజులు వచ్చే యాత్రికులు, సందర్శకులు వచ్చే అవకాశం ఉందన్నారు. పర్యాటకుల సౌకర్యార్థం తీరం వెంబడి తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదుల నిర్మాణం, పారిశుధ్య నిర్వహణ తదితర వాటిపై సూచనలు చేశారు. ఈ సమావేశంలో తహశీల్దార్ కె.రాజకిషోర్, డిఎల్‌పిఒ జ్యోతిరమ్మయి, డిప్యూటీ ఎంపిడిఒ మేడిది నవీన్ కిరణ్, ఎంపిటిసి అందే దొరబాబు, పలు శాఖల అధికారులు ఉన్నారు.

వైసిపి గ్రామ అధ్యక్షులుగా ఏసురత్నం

ప్రజాశక్తి - నరసాపురం

సరిపల్లి గ్రామ వైసిపి అధ్యక్షులుగా వర్ధనపు యేసు రత్నం(చంటి) నియమితులయ్యారు. గురువారం నరసాపురం వైసిపి కార్యాలయంలో జిల్లా వైసిపి అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు, వైసిపి రాష్ట్ర నాయకులు పిడి.రాజుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ప్రసాద్ రాజు మాట్లాడుతూ పార్టీకి పూర్వ వైభవం తెచ్చే విధంగా, జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేవరకు పనిచేయాలన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసిన ప్రతి నాయకుడు, ప్రతీ కార్యకర్తకు, అధికారంలోకి వచ్చిన తర్వాత తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సరిపల్లి ఎంపిటిసి చిన్నం వెంకట్రావు, నరసాపురం మండల వైసిపి అధ్యక్షులు ఉంగరాల రమేష్ నాయుడు, నియోజకవర్గ వైసిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు కోడెల వెంకట్రావు పాల్గొన్నారు.

మోటార్ బైక్‌ల దొంగలు అరెస్టు

ఐదు బైకులు స్వాధీనం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మోటర్ బైక్‌లు కాజేసిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని, రూ.2 లక్షల 75 వేల విలువ గల ఐదు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సిఐ బి.రవికుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం రూరల్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెంటపాడు మండలం రావిపాడులో బైక్ దొంగతనం జరిగిందంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు పెంటపాడు ఎస్ఐ కెసిహెచ్.స్వామి దర్యాప్తు చేయగా చిలకంపాడు లాకులు సమీపంలో అనుమానంగా తిరుగుతున్న ముగ్గురిని పట్టుకుని విచారించారు. వారు ఐదు బైకులు దొంగతనం చేయడంతో పాటు, గుడిలో హుండీని కూడా కొల్లగొట్టినట్లు చెప్పారన్నారు. నిందితులు ముగ్గురిలో ఒకరు మైనర్ కావడంతో అతనిని జువైనల్ కోర్టుకి పంపి, మిగిలిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులు తణుకు చెందిన ఆర్.లోకేష్, మానుపాటి దుర్గాప్రసాదులుగా గుర్తించినట్లు తెలిపారు. కేసు ఛేధించిన పెంటపాడు ఎస్ఐను, అతనికి సహకరించిన కానిస్టేబుల్స్ అనిల్ కుమార్, మోహన్, నవీన్, హోంగార్డ్ వెంకటేశ్వరరావులను రూరల్ సిఐ రవికుమార్ అభినందించారు.

బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలి

- దుకాణాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి
- బాణసంచా కాల్చేటప్పుడు కాటన్ వస్త్రాలు శ్రేయస్కరం
- అగ్నిమాపక అధికారి

గుమ్మడి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఆకివీడు



దీపావళి సామగ్రి విక్రయదారులు, వినియోగదారులు ఇరువురు ప్రమాదాలకు అవకాశం లేకుండా నిబంధనలు పాటించాలని అగ్నిమాపక అధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు సూచించారు. ఆయన గురువారం ప్రజాశక్తితో మాట్లాడారు. పలు సందేహాలను నివృత్తి చేశారు. దుకాణదారుడు తమ దుకాణాలు ఏర్పాటు చేసుకునేటప్పుడు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి దుకాణానికి తగినంత దూరంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. బాణసంచా విక్రయ సమయంలో ప్రభుత్వ నిబంధనలు, నియమాలు పాటించి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రమాదాలు చెప్పి రావన్న ఆలోచనలు ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. వినియోగదారుడు బాణసంచా కాల్చేటప్పుడు ముందస్తు జాగ్రత్తలతో ఉండాలన్నారు. లైసెన్స్ లేని వారు ఏవిధమైన బాణసంచా విక్రయించవద్దని ఆయన సూచించారు. ఎక్కడైనా అగ్నిప్రమాద ఘటనలు సంభవిస్తే అగ్నిమాపక శాఖ కార్యాలయం 08816 252099, 99637 26735 నెంబర్లకు అత్యవసరంగా తెలియజేయాలన్నారు.

చిట్ - చాట్

ప్రశ్న : దీపావళి బాణసంచా తయారు చేసే కేంద్రాలు ఎన్ని ఉన్నాయి?

జవాబు : లైసెన్స్ తయారీ కేంద్రాలు లేవు.

ప్రశ్న : మీ పరిధిలో హోల్‌సేల్ వ్యాపారులు ఉన్నారా? ఎంత మందికి లైసెన్స్ ఉన్నాయి? ఈ లైసెన్సుల కాలపరిమితి ఎంత కాలం?

జవాబు : మా పరిధిలో హోల్‌సేల్ వ్యాపార లైసెన్సులు రెండు ఉన్నాయి. ఆ వ్యాపారాలు సాగుతున్నాయి. అన్ని నిబంధనల ప్రకారం ఉన్నాయి. కాలపరిమితి సంవత్సరం ఉంటుంది. ప్రతి సంవత్సరం రెన్యువల్ చేసుకుంటారు. ఇక దీపావళి కోసం ప్రత్యేకంగా ఇక్కడ 27 మంది తాత్కాలిక లైసెన్సులకు దరఖాస్తు చేసుకున్నారు. వారికి ఇప్పటికే మంజూరు చేశాము. ఈ లైసెన్స్ కాలపరిమితి మూడు రోజులు మాత్రమే. చలానా రూ.500 మాత్రం చెల్లించాలి.

ప్రశ్న : దుకాణదారులు తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటి?

జవాబు : దుకాణదారులు ప్రతి దుకాణానికి మధ్యలో కనీసం మూడు మీటర్ల దూరం పాటించాలి. ప్రతి దుకాణం వద్ద నీటి బకెట్లు, నిప్పునార్పే ఒక కేజీ బరువు ఉండే కార్బన్‌డయాక్సైడ్ యంత్రాన్ని దగ్గర ఉంచుకోవాలి. ప్రతి దుకాణం వద్ద నీటి నిల్వలు, ఇసుక గుట్టలు సిద్ధంగా ఉంచుకోవాలి.

ప్రశ్న : దుకాణాలను తనిఖీ చేస్తారా?

జవాబు : ప్రతి దుకాణం వద్ద పూర్తి కాలం వ్యక్తిగత పర్యవేక్షణ ఉంటుంది.

ప్రశ్న : బాణసంచా కాల్చుకునే వారికి మీరిచ్చే సూచనలు, సలహాలు?

జవాబు : ప్రతి ఒక్కరూ బాణసంచా కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు ధరించాలి. నైలాన్ గుడ్డలు వేడిని ఆకర్షించే ప్రమాదం ఉంది. పిల్లల్ని దూరంగా ఉంచాలి. ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే నీటిలో చేతులు పెట్టి డాక్టర్ దగ్గరికి వెళ్లాలి. బర్నాలు, ఇతర మందులు అంత శ్రేయస్కరం కాదు. మంటలు ఏర్పడినప్పుడు వెంటనే దుప్పటి కప్పి మంటలు ఆర్పే ప్రయత్నం చేయాలి. మాకు వెంటనే తెలియపరచండి.

సిఐటియు పట్టణ కన్వీనర్‌గా లక్ష్మణ్



ప్రజాశక్తి - నరసాపురం

సిఐటియు పట్టణ నూతన సమన్వయ కమిటీ కన్వీనర్‌గా కోడి లక్ష్మణ్, కోకన్వీనర్‌గా నోముల కొండ, ఎండి బేగం ఎన్నికయ్యారు. వీరితోపాటు కమిటీ సభ్యులుగా కోరాడ బద్రి, ఎస్.వెంకటేశ్వర్లు, వంగ దుర్గావరప్రసాద్, నవాబత్తుల హరి, సమతం దుర్గా, ఆకుల నీలిమ, పొన్నాడ మల్లేష్, పైల దుర్గాప్రసాద్, చీరల గంగులు, పిట్ట సురేష్, బోడ సింగప్పారావు, జి.ఆజాద్, ముద్రగడ ఉమాదేవి, ఎం.గౌరమ్మ, జి.నాగవేణి తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం మహాసభ తీర్మానాలు చేసింది. ఆక్వా రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం, ఇఎస్ఐ, పిఎఫ్ గుర్తింపు కార్డులను కల్పించాలన్నారు. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగస్తులకు కనీస వేతనం రూ.26 వేలు కల్పించాలని, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డులో నిధులు ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి ఖర్చు చేయాలన్నారు. ఆటో కార్మికులకు వాహన మిత్ర పథకం ద్వారా డబ్బులు పడని లబ్ధిదారులకు నిబంధనలను సడలించి ప్రతి ఒక్కరికి పథకాన్ని వర్తింపచేయాలని మహాసభ తీర్మానం చేసింది.

అన్నదానం గొప్పది

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



పండ్లు పంపిణీ చేస్తున్న రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

అన్నదానానికి మించిన దానం మరొకటి లేదని ఏపి డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. దొడ్డనపూడి గ్రామంలో గ్రామ సర్పంచి కొల్లి సుబ్బారావు కుమార్తె భాస్విని పుట్టినరోజు గురువారం నిర్వహించారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు చేతుల మీదుగా ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అయ్యప్ప స్వాములకు అన్నదానంతో పాటు పండ్లు పంపిణీ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన గ్రామ సచివాలయం ప్రారంభం



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

దొడ్డనపూడి గ్రామంలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్, పంచాయతీ నిధులు రూ.43 లక్షల 60 వేల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దొడ్డనపూడి గ్రామ సర్పంచి కొల్లి సుబ్బారావు, టిడిపి మండల అధ్యక్షులు అరేటి వెంకట రత్న ప్రసాద్, జనసేన గ్రామ అధ్యక్షులు కొల్లి లక్ష్మణ్, టిడిపి గ్రామ అధ్యక్షులు అరేటి కృష్ణ, మేకా వీరాస్వామి పాల్గొన్నారు.

లంకలకోడేరులో 'పొలం బడి'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు మండలంలోని లంకలకోడేరు గ్రామంలో గురువారం నిర్వహించిన పొలం బడి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వర్లు హాజరైయ్యారు. ఆయన రైతులతో మాట్లాడుతూ వరి పొలంలో విచక్షణారహితంగా పురుగు మందులు వాడకూడదని, అవసరం మేరకే పురుగు మందులు వాడాలని తెలియజేశారు. ఎరువుల విషయంలో కూడా యూరియా సూపర్ పొటాష్‌తో పాటుగా పచ్చిరొట్ట పైరులను కూడా వేసి నేల ఆరోగ్యాన్ని కాపాడాలని తెలియజేశారు. ఎడిఎ పి.మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటలో ఏ తెగుళ్లు, అలాగే పురుగులు ఆశించినవో తెలుసుకొని వాటికి నివారణ చర్యలు రైతులకు వివరించడం జరిగింది. రైతులు శ్యాము, రామకృష్ణ, బాలకృష్ణ, సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకుడు సురేష్, సాయి దుర్గ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన బేటీ బచావో బేటీ పడావో

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని వివేక ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొగల్తూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పిల్లల్లోని మానసిక రుగ్మతలు, మానసిక ఒత్తుల్లను తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మొగల్తూరు మండల శాఖ అధ్యక్షురాలు, వివేకా ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పుష్ప రాంబాబు, ఆరోగ్య కేంద్ర సిబ్బంది కె.భాస్కరరావు, యు.రమణమ్మ, బి.శ్రీనివాస్, ఆశాలు ఉన్నారు.

విద్యార్థులకు హెల్త్ క్యాంపు

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక లజపతిరాయ్ పేట మాంటిసోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్ అండ్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో గురువారం విద్యార్థులకు ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు, స్థానిక విరాట్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ డి.సంజయ్ వర్మ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ వైద్య శిబిరాన్ని క్షత్రియ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు చెరుకూరి సూర్యనారాయణ రాజు ప్రారంభించగా డైరెక్టర్ కెవి.కృష్ణవర్మ, చిలుకూరి కుమార్, ఉపాధ్యాయులు కిషోర్, పద్మ, శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో 42 మంది ఎంపిక

ప్రజాశక్తి - తణుకు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 విభాగంలో జిల్లా స్థాయిలో సెప్టెంబరు 12 నుండి అక్టోబరు 15 వరకు వివిధ ప్రాంతాల్లో జరిగిన స్పోర్ట్స్, గేమ్స్ ఎంపికలో ఎస్‌కెఎస్‌డి మహిళా జూనియర్ కళాశాలకు చెందిన 42 మంది విద్యార్థినులు ఎంపికైయ్యారని కళాశాల ప్రిన్సిపల్ భూపతిరాజు హిమబిందు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి పోటీలకు తమ కళాశాల నుండి ఇంత మంది విద్యార్థినులు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. కళాశాలలో అన్ని క్రీడా సౌకర్యాలు వినియోగించుకొని మంచి సాధన చేసి రాష్ట్ర స్థాయిలో కూడా ప్రథమ స్థానాన్ని సాధించాలన్నారు. బ్యాడ్మింటన్‌లో 8 మంది, టేబుల్ టెన్నిస్‌లో 1, చెస్‌లో 3, కబడ్డీలో 4, ఖోఖోలో 3, వాలీబాల్‌లో 3, యోగాలో 2, బాల్ బ్యాడ్మింటన్‌లో 4, టెన్నికాయిట్‌లో 1, త్రోబాల్‌లో 1, క్రికెట్‌లో 1, హ్యాండ్‌బాల్‌లో 1, బాస్కెట్‌బాల్ 1, హాకీలో 5, అథ్లెటిక్స్‌లో విభాగంలో 200 మీటర్ల పరుగు పందెంలో కె.నందిని ఎంపికైయ్యారన్నారు. వీరంతా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డి.తారకమహాలక్ష్మీ పాల్గొన్నారు.

మొగల్తూరులో అన్నసమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల కేంద్రం మొగల్తూరులోని భవనం శివన్నారాయణ కాలిబర్లర్ వంతున వద్ద ఉన్న కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో గురువారం రాత్రి అన్న సమారాధన చేశారు. ఇటీవల దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. సమారాధనలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి సౌకర్యాలు కలగకుండా నిర్వాహణ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సంపూర్ణ ఆరోగ్యానికి ఆకుకూరలు వాడాలి

కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు

భీమవరం టౌన్ : సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలంటే ప్రతి వ్యక్తి ఆకుకూరలు, కాయగూరలు వాడాలని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఉన్నత భారత్ అభియాన్ సెల్ విభాగం ఆధ్వర్యంలో కాళ్ల మండలం పెద అమిరం గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద 'ప్రపంచ ఆహార దినోత్సవం'ను పురస్కరించుకొని ఆహార భద్రత సదస్సు, ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంటి వైద్య శిబిరాన్ని గ్రామపంచాయతీ సర్పంచి డి.సోమేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం యుబిఎ పెదఅమిరం కోఆర్డినేటర్ డాక్టర్ కెఎం.గణేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు మాట్లాడుతూ ఆహార అలవాట్లను బట్టి ఆరోగ్యం కూడా ఉంటుందని, సరైన ఆహారం తీసుకోకుండా బయట లభ్యమయ్యే జంక్ ఫుడ్స్‌ను వాడితే ఒబిసిటీతో పాటు రకరకాల వ్యాధులు సోకే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీనిని ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు. కార్యక్రమంలో వెట్ సెంటర్ హెడ్ డాక్టర్ ఆర్.వేణు రెడ్డి, యుబిఎ కోఆర్డినేటర్ డాక్టర్ టి.రాంబాబు, డాక్టర్ జి.సూరిబాబు, డాక్టర్ పి.రఘురాం, జీవన్ కుమార్, షణ్ముగం పాల్గొన్నారు.

దాతల సహకారం ఆదర్శనీయం

వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జీవన్ ప్రతాప్



దాత కృష్ణారావును సత్కరిస్తున్న జీవన్ ప్రతాప్

ప్రజాశక్తి - కాళ్ల

ప్రభుత్వ కార్యాలయాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిదని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జీవన్ ప్రతాప్ అన్నారు. కాళ్ల వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. శిథిలావస్థకు చేరిన ఎఒ కార్యాలయాన్ని సుమారు రెండు లక్షల రూపాయలతో అభివృద్ధికి దాతలు సహకరించడంతో పాటు దగ్గరుండి పనులు చేయించటం ద్వారా భవనం రూపురేఖలు మారాయన్నారు. అనంతరం దాతలు తోట కృష్ణారావు, పచ్చిగోళ్ల నాగబాబులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, మండల వ్యవసాయ అధికారి పి.రమేష్ నాయుడు, వివిధ గ్రామాల డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

'శ్రీసూర్య'లో ఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి - నరసాపురం



ఫుడ్ ఫెస్టివల్ పరిశీలిస్తున్న బ్రహ్మాజీ

నరసాపురం శ్రీసూర్య ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో గురువారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం ఘనంగా జరిగింది. చరిత్ర నుండి నేటి వరకు ఉన్న ఆహార సంస్కృతిని ఇక్కడ విద్యార్థులు వివిధ వంటకాలను ప్రదర్శించడానికి స్టాళ్లను ఏర్పాటు చేయడం ఆకట్టుకుంది. వంట నైపుణ్యాలను, ముఖ్యంగా తల్లిదండ్రుల మధ్య ఆహార పదార్థాల తయారు చేయడం, సుపరిచితమైన, కొత్త రకాల వంటకాల ప్రదర్శన, విద్యార్థులకు ఆనందాన్ని, వినోదాన్ని అందించింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం కనిపించింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఒక ఆహ్లాదకరమైన, ఇంటరాక్టివ్ సెట్టింగ్‌లో ఒకచోట చేర్చడంతో కార్యక్రమం విజయవంతమైంది. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు గొప్ప అనుభూతిని కలిగిస్తాయని శ్రీసూర్య విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన ఉపాధ్యాయినులు జి.భవాని, బి.కోటేశ్వరి, పి.కోమలవల్లి, కె.ప్రసూన, ఎ.శ్రీదుర్గ, సిహెచ్.భవానిలకు కరెస్పాండంట్ బ్రహ్మాజీ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అకడమిక్ డైరెక్టర్ ఘంటసాల హేమవల్లి, కళాశాల అకడమిక్ అడ్వైజర్ బి.రామచంద్రారెడ్డి, స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.సతీష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.శ్రీనివాస్, డి.శ్రీకళ, ఎమ్.రాజేష్, కె.నాగశ్రీను పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు



ప్రారంభిస్తున్న రఘురామ కృష్ణరాజు

ఉండి : గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘు రామకృష్ణరాజు అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని మహదేవపట్నం గ్రామంలో సుమారు రూ.70 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, మైక్రో వాటర్ ఫిల్టర్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గ్రామంలోని మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. కెనరా బ్యాంకు ఆర్థిక సహకారంతో 10 లక్షల రూపాయల వ్యయంతో మైక్రో వాటర్ ఫిల్టర్లను ఏర్పాటు చేశామని, కెనరా బ్యాంక్ సహకారం మరువలేనిదని కెనరా బ్యాంకు ప్రతినిధి ఫణికుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి వనిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి శ్రీనివాస్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, ఎఎంసి ఛైర్మన్ కలిదిండి రామకృష్ణంరాజు, ఎఎంసి వైస్ ఛైర్మన్ యడవిల్లి వెంకటేశ్వరరావు, డిసి వైస్ ఛైర్మన్ మంతెన సాయి లచ్చిరాజు, టిడిపి మండల అధ్యక్షులు కె.నాగరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జి గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలి : ఎంఎల్‌సి



మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

నరసాపురం : ఉపాధ్యాయులు హక్కుల కన్నా పిల్లల భవిష్యత్‌పై బాధ్యతగా వ్యవహరించాలని ఎంఎల్‌సి గోపీమూర్తి అన్నారు. పట్టణంలోని లెనిన్ హై స్కూల్లో యుటిఎఫ్ ఆధ్వర్యాన మెగా డిఎస్‌సి ఉత్తీర్ణులైన నూతన ఉపాధ్యాయులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి గోపీమూర్తి పాల్గొని మాట్లాడుతూ అందరూ సమయపాలన పాటించాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచి, ప్రభుత్వ పాఠశాలకు పూర్వ వైభవం తీసుకుని రావాలన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయుటకు కృషి చేయాలన్నారు. ఉత్తమ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యకులు విజయరామరాజు, ఎం.మార్కండేయులు, ఎస్.అజయ్, యు.పెద్దిరాజు, బి.సూర్య కుమారి, పట్టణ ప్రెసిడెంట్ కె.మాణిక్యాల రావు పాల్గొన్నారు.